BHARATH SAMACHAR DIGITAL

23, నవంబర్ 2026, సోమవారం భారత్ సమాచార్

నర్సాపూర్‌లో ఘోర ప్రమాదం.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: నర్సాపూర్ పట్టణ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 28 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి చెందింది. సిద్దిపేట పట్టణానికి చెందిన కోడూరి సుష్మ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తూ ఉప్పల్‌లోని ఓ హాస్టల్‌లో నివాసం ఉంటోంది. హైదరాబాద్‌కు తిరిగి వెళ్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో ఆమె ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

ఈ నెల 20న సిద్దిపేటలోని తన ఇంటికి వచ్చిన సుష్మ, తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరింది. సోమవారం తెల్లవారుజామున సుమారు 6 గంటల సమయంలో నర్సాపూర్ పట్టణ పరిధిలో ఆమె ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో సుష్మ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన అనంతరం ఆమె మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

సుష్మ మృతి విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ మృతదేహాన్ని పరిశీలించి ఆమెగా గుర్తించారు. అనంతరం సుష్మ తండ్రి కోడూరి నర్సింలు నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పాపన్నపేట మండలం శానాయపల్లి గ్రామానికి చెందిన చకలి దశరథ్ కారు నడిపినట్లు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నర్సాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదం ఎలా జరిగింది, ప్రమాదానికి గల కారణాలు ఏమిటి, డ్రైవర్ పాత్ర తదితర అంశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఎస్‌ఐ

రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని నర్సాపూర్ ఎస్‌ఐ ఏ. రంజిత్ కుమార్ సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని కోరారు. తమ ప్రాణాలతో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలను కూడా కాపాడే బాధ్యత ప్రతి వాహనదారుడిపై ఉందని తెలిపారు. బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలను నివారించాలని సూచించారు.

© 2026 Bharath Samachar